కొంచెం కొంచెం.. మింగుతున్నారు..

- రాత్రికి రాత్రే మట్టితో నింపుతున్న కబ్జాదారులు
- కబ్జా కోరల్లోకి పీర్జాదిగూడ పెద్ద చెరువు
- రాజకీయ నాయకుల ప్రమేయంతో చెరువులో మట్టి
- సమన్వయ లోపంతో పట్టించుకోని అధికారులు
- ఒకవైపు సుందరీకరణ, మరోవైపు జోరుగా కబ్జాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


పీర్జాదిగూడ పెద్దచెరువులో మట్టితో నింపి చదును చేస్తూ..


మినీ ట్యాంక్‌బండ్‌గా పీర్జాదిగూడ పెద్దచెరువు

మేడిపల్లి: పీర్జాదిగూడ పెద్దచెరువు రోజురోజూకూ కబ్జా అవుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడి నగరంలోని పెద్దచెరువు భూమి యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతోంది. కబ్జాదారులు రాత్రి వేళలో మట్టితో చెరువును పూడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాప్రతినిధులు రెచ్చిపోతున్నారని, పెద్దఎత్తున కబ్జాలకు పాల్పడుతున్నారని పలువురు అంటున్నారు. ఇందులో అధికారులకూ ప్రమేయం ఉందని ఆరోపిస్తున్నారు. పెద్దఎత్తున ముడుపులు ముట్టడంతో కబ్జా అవుతున్నా.. ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని, పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రికి రాత్రే మట్టితో నింపుతూ..

శివారు కార్పొరేషన్ల పరిధిలో భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ భూములు, చెరువులు, కాల్వలు, నదుల శిఖం భూములు కబ్జాదారులు కన్నుపడి కనుమరుగవుతున్నాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువుపై కబ్జాదారుల కన్ను పడింది. ఈ చెరువులో రాత్రికి రాత్రే మట్టితో నింపుతూ.. కబ్జా చేస్తూ ఇళ్లను నిర్మించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు శిఖం భూమిని మట్టితో నింపుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

రూ.15 కోట్ల నిధులను వెచ్చించి..

పెద్ద చెరువు విస్తరణ దాదాపుగా 34.11 ఎకరాలుగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. రికార్డుల ప్రకారం ఈ చెరువు భూమి ఎంతవరకు మిగిలి ఉందో కూడా తెలియని దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. నగరం విస్తరిస్తూ జనవాసాలు పెరుగుతుండటంతో చెరువు నానాటికీ తన ప్రభావాన్ని కోల్పోతూ కుచించుకుపోవడం గమనార్హం. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించింది. అయినా చెరువులు కబ్జాలకు గురవుతూ కనుమరుగవుతున్నాయి. పీర్జాదిగూడ పెద్దచెరువు సుందరీకరణకు హెచ్ఎండీఏ రూ.15 కోట్ల నిధులను వెచ్చించి మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేసినా వాటిని లెక్కచేయకుండా చెరువులో సైతం మట్టి నింపేసి.. ఆ తర్వాత ఇంటి నిర్మాణాలు చేపట్టడం అలవాటుగా మారింది. ఇప్పటికైనా చెరువుల ఆక్రమణలపై అధికారులు సమన్వయంతో పనిచేసి ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీర్జాదిగూడ ప్రజలు కోరుతున్నారు.

సహకరించని మున్సిపల్ అధికారులు

అధికారులు రెండు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఇదేవిషయంపై ఇరిగేషన్ శాఖ అధికారిని వివరణ కోరగా చెరువులో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో మట్టిపోసి కబ్జాలకు పాల్పడుతున్నది నిజమేనని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని, మున్సిపల్ అధికారులు తమకు సహకరించడం లేదని తెలిపారు.



ప్రభువు చూపిన మార్గంలో నడవాలి


సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: లోక రక్షకుడైన యేసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలోని సర్వెంట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్, నెహ్రూనగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు భాగ్యరాజ్, జగన్నాథం, రాజు, టైటస్, స్థానిక నేతలు బోదాసు లక్ష్మీనారాయణ, వాసుగౌడ్, పీఆర్ ప్రవీణ్, చిన్నదుర్గయ్య, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, శ్రీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహ్మదీయ కాలనీవాసులు

కాప్రా: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు కాప్రా డివిజన్ మహ్మదీయ కాలనీవాసులు. ఇదే విషయంపై మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018 నుంచి ఎన్నోసార్లు స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యపై వినతిపత్రం అందజేశామని, ఇప్పటికీ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకే.బద్రోద్దీన్, ఉపాధ్యక్షులు సయ్యద్ సాబెర్ అలీ, సభ్యులు అబ్దుల్ ఖాదర్, గఫర్, నౌమానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సంపత్‌గౌడ్


నియామకపు ఉత్తర్వులను అందుకుంటున్న సంపత్‌గౌడ్

మల్లాపూర్: డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లాపూర్ మర్రిగూడకు చెందిన బండి సంపత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ కుమార్ పటేల్ నియామకపు ఉత్తర్వులను సంపత్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంపత్‌గౌడ్ మాట్లాడుతూ ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో మల్లాపూర్‌లో యూత్ కాంగ్రెస్ పటిష్టతకు అహర్నిశలు శ్రమిస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నెమలి అనిల్‌కుమార్, కోయల కొండ రాజేష్, లింగంకి కృతజ్ఞతలు తెలిపారు.

భగవంతుడి దివ్యవాణి భగవద్గీత


విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తూ..

రామంతాపూర్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల రామంతాపూర్ అరోరా పీజీ కళాశాలలో పలు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ భగవద్గీత సాక్షాత్తు భగవంతుని దివ్యవాణి అని, దీని మహిమ అపారమైందని, అపరిమితమైందని అన్నారు. 24 ఏళ్లుగా పాఠశాలలో చదివే విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్లాది వెంకటరమణ శాస్త్రి, విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు గుమ్మల సత్యం, లగిశెట్టి జగదీష్, గువ్వల సోమన్న, చలవాది సుబ్బ రామయ్య, కేశవమూర్తి, జాన్, అబ్రహం, భూపతి, సుదర్శన్, శశికళ, రాజ్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిని పరిశీలించిన అధికారులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఉమ్మడి మండలం అవుషాపూర్, అంకుషాపూర్, పట్టణంలోని గట్టు మైసమ్మ వద్ద జాతీయ రహదారిని జాతీయ రహదారుల శాఖ డిప్యూటీ మేనేజర్ నవకాంత్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులను గమనించి అండర్ పాస్ రోడ్లు నిర్మించాలని, ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని, ఇటీవల ఢిల్లీలో నేషనల్ హైవే అధికారులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు.

అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తూ..

రామంతాపూర్: గాంధీనగర్‌లోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డిని స్థానిక సంక్షేమ సంఘాలు ఉద్యమకారులు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయాలకు తావులేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తానని, అదేవిధంగా నియోజకవర్గంలో పలు మురికివాడల్లో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయాన్ని తాను ఎన్నికల ప్రచారంలో గమనించానని, పెద్ద కాలనీల అభివృద్ధితో పాటు మురికివాడల్లోనూ మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు, మాజీ కౌన్సిలర్లు గవ్వల జలంధర్, ముత్యాల నరసింహ, పాలకూరి శ్రీకాంత్‌గౌడ్, మహ్మద్ ముస్తాక్, బిల్డర్ లింగం యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలి


బ్రహ్మపురి కాలనీ సమస్యలపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: బ్రహ్మపురి కాలనీ ప్రధాన రహదారి డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదిన పనులను చేపట్టాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీవరేజ్, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి మంగళవారం బ్రహ్మపురి కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ, అంతర్గత రోడ్లు వంటి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ, రోడ్ల కోరకు నిధులను అంచనా వేసి ప్రాతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. డ్రైనేజీ సమస్యలపై అధికారులు ఆలసత్వం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ ప్రవంతి, వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్, వాసుగౌడ్, నర్సింగ్‌రావు స్థానిక నేతలు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌ల పూర్తికి సహకరించండి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: నియోజకవర్గంలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు, ఇతర ప్రాజెక్ట్‌ల పూర్తికి సహకరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సఫిల్‌గూడ వద్ద లెవెల్ క్రాసింగ్ మూసివేయడంతో వాహనదారులకు ఇబ్బందులతో పాటు ఇతర మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు పెరిగాయన్నారు. గతంలోనే ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు డ్రాయింగ్ సిద్ధం చేశారని, త్వరలోనే సంయుక్త తనిఖీలు చేయడానికి జీఎం అంగీకరించారన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఇప్పటికే ఆర్‌కెపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి విస్తరణకు అవకాశాలను పరిశీలించాలని కోరామన్నారు. అల్వాల్ లోతుకుంట నుంచి భూదేవినగర్ ఆర్‌యూబీ వరకు నాలా డీసిల్టింగ్ చేయకపోవడం వలన ఇతర ప్రాంతాల్లో వరద ముంపునకు గురవుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వాజుపేయినగర్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం ప్రాజెక్ట్ మంజూరైనా ప్రారంభం కాలేదని అన్నారు. తుర్కపల్లి, బొల్లారం లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ లేదా ఆర్‌వోబీ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించమని కోరినట్లు చెప్పారు. ఎంఎంటీఎస్ ఫేజ్–2లో భాగంగా సనత్‌నగర్ మీదుగా మౌలాలి, హైటెక్ సిటీ వరకు ప్రారంభించాలని కోరామన్నారు. జీఎం అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం ఉందన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల మార్పు, మరమ్మతుల కారణంగా బుధవారం నీటి సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ తెలిపారు. విసాసత్ ఎన్‌క్లేవ్, కుమ్మరికుంట, మార్కండేయ దేవాలయం, శివాలయం, నార్త్ కళ్యాణపురి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

'రెయిన్‌బో'లో అమ్మ, నాన్న, గురువు శతకం



మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఎంజీ కాలనీలో ఉన్న రెయిన్‌బో పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌసియాఖాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి తానా తెలుగు సంఘం సమన్వయంతో చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకం పద్యాలు, విద్యార్థులు, వేదికను అలంకరించి పద్యాలు చెప్పారు.

అనుమతి లేని నిర్మాణాలపై కఠిన చర్యలు



అల్వాల్: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న భవనాలపై జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని కానాజీగూడ వెంకటాపురం అల్వాల్‌లో మంగళవారం పలు ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభ దశలోనే కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని జీహెచ్ఎంసీ అధికారులు సాంబయ్య, రాజేంద్రగౌడ్ హెచ్చరించారు.

వైభవంగా స్వామివారి ఊరేగింపు


అల్వాల్ పురవీధుల్లో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

అల్వాల్: అతి పురాతన దేవాలయం దక్షిణ తిరుపతిగా పిలువబడే శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు ఆచార్యులు విజయ సారథి ఆలయ పూజారులు వంశీ, శ్రీనివాస్, గోపాల్, శివరామకృష్ణ, రాము, సురేందర్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి అభివృద్ధికి అధికారులు భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జలమండలి అధికారులను వారి సమన్వయంతో కలిసి పనిచేయాలని కోరారు. శానిటేషన్ విషయంలో చురుగ్గా పనిచేసి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లపై సంబంధిత అధికారులను వివరాలు తీసుకొని సూచనలు చేశారు. బస్తీ దవాఖానాల పనితీరు వివరాలు కోరారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ అధికారులు భూసమస్యలను సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలని కోరారు. అధికారులు ప్రజా సమస్యల పట్ల వేగంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పౌర సేవా కేంద్రాలు సమస్యలు గుర్తించి సకాంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాసేవ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, పూర్తి జవాబుదారీ తనంతో పనిచేయాలని సూచించారు.

మౌలాలి డివిజన్ అభివృద్ధికి కృషి చేద్దాం


సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్

మౌలాలి: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ అన్నారు. మంగళవారం సర్కిల్ అధికారులు డీఈ వేద కుమారి, ఏఈ మధురమ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో కలిసి కార్పొరేటర్ సమీక్ష సమావేశంలో నిర్వహించారు. అభివృద్ధికి కృషి చేద్దామని అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

హానికరమైన చెత్తను వేరుచేయాలి

ఘట్‌కేసర్: తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరుచేయాలని మూడో వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేక్ ఇండియా స్వచ్ఛ గ్రీన్ జైన్‌లో భాగంగా ఐటీసీ డబ్ల్యూఓడబ్ల్యూ ఆధ్వర్యంలో 'నా చెత్త.. నా బాధ్యత' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలని, హానికరమైన చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం తడి, పొడి, హానికర చెత్తను వేరుచేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, వావ్ ప్రతినిధులు రాకేశ్, రామకృష్ణ, అనురాధ, నాయకలు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌ముదిరాజ్, ముత్యాలుయాదవ్, రహీం పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించండి

కీసర: వివిధ గ్రామాల్లోని రైతులు తమ వ్యవసాయ విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని కీసర మండల విద్యుత్ ఏఈ మురళీకృష్ణ కోరారు. కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 2,500 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఇప్పటివరకు సుమారు రూ.45 లక్షల మేర వ్యవసాయ విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ విద్యుత్ బిల్లులను వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఒక్క వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రోజు రూ.1 చొప్పున నెలకు రూ.30 విద్యుత్ బిల్లు వస్తుందని, ఈమేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతులు తమ విద్యుత్ బిల్లులను చెల్లించాలన్నారు. లేనిచో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్‌ను నిలిపివేస్తామన్నారు. అదేవిధంగా అక్రమంగా వ్యవసాయ విద్యుత్‌ను వినియోగిస్తున్న రైతులు తమ కనెక్షన్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలన్నారు.

వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు

కీసర: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా సప్త ద్వారాల ద్వారా ఉత్తరద్వారం నుంచి స్వామివారిని భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత పాత్ర కీలకం



డా.చద్దాకు జ్ఞాపిక అందజేస్తున్న డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్


ఎన్‌జీఆర్‌ఐ రాక్ గార్డెన్ విశిష్టతను తెలుపుతున్న శాస్త్రవేత్త పీవీ విజయ్‌కుమార్

ఉప్పల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువతదే కీలక పాత్ర అని, విద్యార్థి దశ నుంచి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని డా.ఆర్‌కే చద్దా సూచించారు. సీఎస్ఐఆర్ జాతీయ భూభౌతిక పరిశోధన(ఎన్‌జీఆర్ఐ) సంస్థలో మంగళవారం ఏర్పాటు చేసిన భారత అంతర్జాతీయ విజ్ఞాన ఉత్సవాల(ఔట్ రీచ్) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేర్చుకోవడం అనేది జీవితంలో నిరంతర ప్రక్రియ అని, ఇలాంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌జీఆర్ఐ సంస్థ యువ శాస్త్రవేత్తలకు ఎంతో నేర్పిందని, ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. ఇక్కడ నేర్చుకున్న యువ శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్‌జీఆర్ఐ సైంటిఫిక్ స్టడీస్‌లో ముందు వరుసలో ఉందన్నారు. ఫిజికల్ ప్రాపర్టీ ఆఫ్ ఎర్త్ గురించి ఎంతో నేర్పుతుందని తెలిపారు. ఒకటి రెండు కాదు ఎన్నో అంశాల్లో ఎంతో దోహదపడుతుందని డైమండ్స్, ఆయిల్, గ్యాస్, గ్రౌండ్ వాటర్ లభ్యత, భూకంపాలు, వాతావరణ కాలుష్య కారకాల గురించి చేసిన పరిశోధనలు, రాజస్థాన్ లాంటి ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మరిన్ని అద్భుతాలు చేస్తున్నామన్నారు. అనంతరం విజ్ఞాన భారతి(విభా) తెలంగాణ సమన్వయకర్త జీఎల్ మూర్తి యువ విద్యార్థులకు, విద్యావేత్తలకు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ సభకు స్వాగతం పలుకుతూ సంస్థ చేసిన విజయాలు, అద్భుతాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ సైంటిస్టులు దేవేంతర్ కుమార్, శ్రీనివాసశర్మ, పీవీ విజయ్‌కుమార్, అమిత్‌కుమార్ బన్సల్ తదితరులు పాల్గొన్నారు.